హనుమకొండ చౌరస్తా : కేయూ లైబ్రరీ ఎదుట జీవో 29 రద్దు చేయాలని ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

జీవో 29కి వ్యతిరేకంగా బీసీ పొలిటికల్ జాక్ ఆందోళన

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : హనుమకొండలో జీవో 29కి వ్యతిరేకంగా బీసీ పొలిటికల్ జాక్ ఆధ్వర్యంలో ఆందోళన తెలిపారు. బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ పొలిటికల్ జాక్ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. జీవో 29ను ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా తీసుకువచ్చి ఇతర అభ్యర్థులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం బ్యాక్ డోర్ తెరిచిందన్నారు. ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు మరణశాసనం లిఖిస్తున్నదని, తెలంగాణ ఉద్యమానికి వరంగల్ ఎలా కేంద్రమైందో అదే తరహాలో ఇక్కడి నుంచే మరో బీసీ ఉద్యమం ఉద్భవిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలు ఇలాగే ఉంటే వేలాదిమంది బీసీలు ప్రభుత్వంపై దండెత్తాల్సిన అవసరం వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నేతలు ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, డాక్టర్లు కాళీప్రసాద్, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

'రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం జీవో 29'..

హనుమకొండ చౌరస్తా : రాష్ట్రంలోని గ్రూప్-1 నియామకాల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ వర్గాల అభ్యర్థుల ఉద్యోగావకాశాలను దెబ్బతీసే జీవో 29 వెంటనే రద్దు చేయాలని, గత నియామకాలకు అనుసరించిన పాత జీవో 55 పునరుద్ధరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు డిమాండ్ చేశారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట జీవో 29 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల ఉద్యోగావకాశాల కోసం రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల స్ఫూర్తికి విరుద్ధంగా జీవో 29 తీసుకువచ్చి ఉద్యోగావకాశాలను దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకురాలు కావ్య, కేయూ నాయకులు అభిరామ్ రమేశ్, అశోక్, నరేశ్, బాలకృష్ణ, అనూష, అఖిల, స్వాతి, పృథ్వీరాజ్, సంగీత పాల్గొన్నారు.

నేడు టీజీవోల ఎన్నికలు

హనుమకొండ, నవంబర్ 20 : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఎన్నికలు గురువారం నిర్వహిస్తున్నట్లు ఆయా జిల్లాల కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, ఫణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలోని టీజీవో భవన్‌లో మధ్యాహ్నం 2గంటలకు ఎన్నికలు నిర్వహించి, ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి టీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సహాధ్యక్షుడు శ్యామ్, ఉపాధ్యక్షుడు జగన్ మోహన్‌రావు, కోశాధికారి ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరవుతున్నారని తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ప్రకటించడంతో పాటు అధికారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చిస్తామన్నారు.

'కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించాలి'

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : కాకతీయ యూనివర్సిటీ సాంకేతిక ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించాలని కేయూ సాంకేతిక సంఘం నేతలు బుధవారం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కలిసి తమ సంఘం ఎన్నికలను రాబోయే మూడేళ్లకు నిర్వహించాలని కోరారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో పుల్లా శ్రీనివాస్, వాలె నందయ్య, ప్రేంసాగర్, నలబోలు రాము, బాబు ఉన్నారు.

మహిళా క్యాంటీన్లకు రాజకీయ గ్రహణం

- గ్రూపుల ఎంపికలో నేతల జోక్యం
- అర్హులకు దక్కని అవకాశం

వరంగల్, నవంబర్ 20 : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేయనున్న మహిళా క్యాంటీన్లకు రాజకీయ గ్రహణం పట్టింది. అర్హత కల్గిన మహిళా సంఘాలకు దక్కాల్సిన క్యాంటీన్లు రాజకీయ నాయకుల పైరవీలతో అనర్హులకు దక్కుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఆరు మహిళా క్యాంటీన్లలో ఇప్పటికీ కేవలం రెండు మాత్రమే ప్రారంభమయ్యాయి. ఇంకా నాలుగు క్యాంటీన్ల ఏర్పాటులో నెలల జాప్యం జరుగుతోంది. రాజకీయ నేతల జోక్యం ఎక్కువ కావడంతో మహిళా క్యాంటీన్ల ఏర్పాటు వాయిదా పడుతున్నది.

కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సిద్ధం చేసిన మహిళా క్యాంటీన్

ఆరు నెలలైనా ప్రారంభం కాలేదు..

బల్దియా ప్రధాన కార్యాయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న మహిళా క్యాంటీన్ ప్రారంభించడంలో నెలల జాప్యం జరుగుతోంది. గతంలో ఉన్న క్యాంటీన్‌కు రంగులు వేశారు. ఆకర్షణీయమైన పెయింటింగ్, మరమ్మతులు పూర్తి చేసి ఆరు నెలలు గడుస్తున్నది. అయినా ఇప్పటివరకు క్యాంటీన్ ప్రారంభానికి నోచుకోవడం లేదు. గతంలో అనుకున్న మహిళా సమాఖ్యకు కాకుండా కొత్తగా మరో మహిళా సమాఖ్యకు కేటాయించడంతో ఆలస్యం జరుగుతున్నట్లు తెలుస్తున్నది.

రాజకీయ పలుకుబడి ఉంటే దక్కినట్లే..

రాజకీయ నాయకుల వద్ద పలుకుబడి ఉన్న మహిళా సంఘాలకు క్యాంటీన్లు దక్కుతున్నాయి. బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న మహిళా క్యాంటీన్‌ను తొలుత దివ్యాంగుల మహిళా సమాఖ్యకు కేటాయించాలని నిర్ణయించారు. తీరా రాజకీయ జోక్యంతో అది కాస్తా మారిపోయింది. రామన్నపేటకు చెందిన మహిళా సంఘానికి కేటాయించినట్లు సమాచారం. ఇలా కాశీబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాలతో పాటు ఎనుమాముల మార్కెట్, సీకేఎం, ఎంజీఎం ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనున్న క్యాంటీన్ల కేటాయింపుల్లో పెద్ద ఎత్తున రాజకీయ నాయకుల జోక్యం ఉన్నట్లు ఆరోణలు వస్తున్నాయి.

మాట్లాడుతున్న మంద కుమార్

ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచాలి

హనుమకొండ, నవంబర్ 20 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్ పెంచాలని ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఏకశిల పార్కు ఎదుట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు పింఛన్ల పెంపుపై ప్రస్తావించక పోవడం దారుణమన్నారు. ఈ నెల 26 ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నాయత్వంలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ మాజీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్, పొలిట్ బ్యూరో సభ్యులు అమరాజు స్వామి, బాపు రాజు యాదవ్, సింగారపు రజిత, కన్నారి చంద్రశేఖర్, సింగారపు స్వామి, వక్కల భాగ్య పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీ పీఆర్వోగా హరికుమార్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ పౌర సంబంధాల అధికారిగా(పీఆర్వో)గా వేదాంతం హరికుమార్‌ను నియమిస్తూ బుధవారం ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి నియామక పత్రాన్ని అందజేశారు. 23 సంవత్సరాలుగా ఆర్ట్స్ కళాశాల పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా రక్కిరెడ్డి ఆదిరెడ్డి పని చేశారని, ఆయన ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా హరికుమార్‌ను నియమించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్, అంజన్‌రావు, కరుణాకర్, రమేశ్, సతీశ్ పాల్గొన్నారు.

కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారుల నియామకం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : కాకతీయ విశ్వవిద్యాలయ యూజీ కోర్సుల అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా మైక్రో బయాలజీ విభాగ సహాయ ప్రొఫెసర్ వెంకటయ్యను ఒక సంవత్సర కాలానికి నియమిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటయ్య బీఏ, బీకాం కోర్సులను పర్యవేక్షించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేయూ దూరవిద్య కోర్సుల అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా భౌతికశాస్త్ర విభాగ సహాయ ప్రొఫెసర్ పద్మజను నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేడీసీ పీజీ కోర్సుల్లో 23న స్పాట్ అడ్మిషన్లు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : కాకతీయ ప్రభుత్వ కళాశాల అటానమస్‌లో పీజీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 23న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు. పీజీ కోర్సుల్లో కొన్ని సీట్లు మిగిలి ఉన్నాయని, 50 శాతం కంటే ఎక్కువ మార్కులు ఉన్నవారు అర్హులని, ప్రవేశం కోసం కేడీసీకి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలను తీసుకొని రావాలన్నారు. స్పాట్ రౌండులో ప్రవేశం పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉండదన్నారు. ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, ఎకనామిక్స్, ఎంకామ్ జనరల్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్, మైక్రోబయాలజీ, బాటనీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో సీట్లు మిగిలి ఉన్నాయన్నారు.

కులగణన పారదర్శకంగా నిర్వహించాలి

దామెర, నవంబర్ 20 : మండలంలోని ముస్త్యాలపల్లిలో జరుగుతున్న కులగణన సర్వేను డీబీఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కర్ణాకర్ బుధవారం పరిశీలించారు. సర్వేను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి, నీరటి వినోద, దండు కలమ్మ, లావణ్య పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డివి చిల్లర మాటలు

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

- పూటకో పార్టీ మారిన చరిత్ర నీది
- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

వరంగల్, నవంబర్ 20 : సీఎం రేవంత్‌రెడ్డి చిల్లరగా మాట్లాడుతున్నాడని, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. బుధవారం హంటర్ రోడ్డులోని వేద బాంకెట్ హాల్‌లో ఆమె సీఎంపై ఘాటు విమర్శలు చేశారు. పూటకో పార్టీ మార్చే చరిత్ర, ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకం రేవంత్ రెడ్డి అన్నారు. పోరుగడ్డ వరంగల్‌కు వచ్చి కనీసం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించని సీఎంకు తెలంగాణ పేరు ఎత్తే నైతికత లేదన్నారు. కొత్త సీసాలో పాత సారా అన్నట్లు 2041 మాస్టర్ ప్లాన్ ఆమోదానికి ఏడాది కాలం పట్టిందని విమర్శించారు. అధ్వాన స్థితికి చేరిన కాకతీయ యూనివర్సిటీని పునరుద్ధరించే చర్యలు తీసుకోకపోవడంపై మండిపడ్డారు. ఎంవోయూలు హైదరాబాద్ చుట్టూ పెట్టుకొని మిగతా జిల్లాల యువత భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టారన్నారు. నగర నడిబొడ్డున నిర్మించిన డబుల్ బెడ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చే సోయి లేని రేవంత్ రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వెయ్యి స్తంభాల దేవాలయ మహా మండపం కాంగ్రెస్ హయాంలో కుప్పకూలితే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పునరుద్ధరణ చేశారన్నారు. వరంగల్ నగరానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ విజయచందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, కొలను సంతోష్‌రెడ్డి, జయంతిలాల్ పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా ట్రెజరరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, విశిష్ట అతిథిగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య హాజరై ఈ నెల 14 నుంచి 19 వరకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శశిజాదేవి, గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగులు సంజీవయ్య, జగదీశ్ చందర్‌రెడ్డి, సూరయ్య, అంజయ్య పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి

కళ్లకు గంతలు కట్టుకొని విద్యార్థుల నిరసన

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : పెండింగ్ ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషకుని సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు బకాయిలను విడుదల చేస్తామని, విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని, విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి కేవలం 7శాతం నిధులు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసిందని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ కాలేజీలతో చర్చలు జరిపి బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సభ్యులు సీపతి వినయ్, సంధ్య, ప్రవళిక, రూబి యానా, రాము, రాజు, అనిల్, వినయ్ పాల్గొన్నారు.

కేడీసీ ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు

'రుణాలను గ్రౌండింగ్ చేయాలి'

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి ఆర్థిక మద్దతు పథకాలకు సబ్సిడీ నిధులను విడుదల చేయాలని డీబీఎఫ్ జిల్లా బృందం బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజుకు వినతిపత్రం అందజేసింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2020-21-22 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో వందలాది మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు ఇచ్చి సబ్సిడీ నిధులు విడుదల చేయలేదని, జిల్లా వ్యాప్తంగా వందలాది మంది లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టు కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకున్న నాథుడు కరువయ్యారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సర ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ విడుదల చేయాలని, స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకు లింకేజీలను తొలగించాలని కోరారు. బొర్ర సంపూర్ణ, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్, జిల్లా కార్యదర్శి చుంచు నరేశ్, పుల్యాల మంజుల, మరుపట్ల సుజాత పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు కేయూ టెన్నిస్ జట్టు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు కేరళ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు కేయూ పురుషుల టెన్నిస్ జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శి వెంకయ్య తెలిపారు. ఇందులో విశాల్‌ఆదిత్య, మనోజ్‌కుమార్, హరికృష్ణ, ప్రణయ్, నరేశ్ ఉన్నారని, వీరికి కోచ్-కమ్ మేనేజర్‌గా కిట్స్ కాలేజీ పీడీ వెంకటస్వామి వ్యవహరిస్తారని తెలిపారు.

అక్రమంగా ఇళ్లు నిర్మించిన వారిపై కేసు

నయీంనగర్, నవంబర్ 20 : అక్రమంగా ఇళ్లు నిర్మించిన వారిపై కేయూ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదవనగర్ కృష్ణకాలనీలోని శివాలయం వద్ద ఎస్సారెస్పీ కెనాల్‌కు సంబంధించిన భూమిలో గాజుల రాజేశ్‌రెడ్డి, గంగడి ప్రవంతి, శ్రీరేపాకుల రాము, బండి అశోక్ ఇళ్లు కట్టుకున్నారని ఏఈ నక్క కిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి

ఐనవోలు, నవంబర్ 20 : రాజ్యాంగం కల్పించిన మానవ మౌలిక అవసరాలైన విద్య, వైద్యం, ఇల్లు, భూమి, ఉపాధి వెనుకబడిన అణగారిన మధ్య తరగతి ప్రజలందరికి ప్రభుత్వమే అందించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్‌కు బుధవారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు కొత్తూరు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు కొత్తూరు కుమార్, ప్రధాన కార్యదర్శి నస్కూరి రాజేందర్, నాయకులు కొత్తూరు జయపాల్, కొత్తూరు అనిల్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, నవంబర్ 20 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 11గంటల వరకు కిషన్‌పురా, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3గంటల వరకు పద్మాక్షికాలనీ ఏరియాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

ఆత్మకూరు, నవంబర్ 20 : గూడెప్పాడ్ సెల్ టవర్ దగ్గర ద్విచక్రవాహనం అదుపుతప్పి మంగళవారం రాత్రి యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై పరమేశ్వర్ బుధవారం తెలిపారు. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన నక్క ప్రశాంత్ (25) హనుమకొండలో సీఎం రేవంత్ రెడ్డి మీటింగ్ చూసుకోని వస్తానని ఇంట్లో చెప్పి సోమవారం సాయంత్రం వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన మొగ్గం నరేశ్ కనబడగా అతడిని బైక్‌పై ఎక్కించుకున్నాడు. గూడెప్పాడ్ గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న వాహన లైట్ వెలుతురులో రోడ్డు కనిపించకపోవడంతో బ్రేక్ వేయగా బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రశాంత్, నరేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడ ఉన్న వారు 108 వాహనంలో ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించగా, ప్రశాంత్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మాట్లాడుతున్న వీఆర్ విద్యార్థి

కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా కవి సమ్మేళనం

హనుమకొండ, నవంబర్ 20 : కాళోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్యదర్శి వీఆర్ విద్యార్థి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వీఆర్ విద్యార్థి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా వరంగల్ కవి లోకం ఎదురుచూస్తున్న వేదిక కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రభుత్వం ప్రారంభించడం చాలా సంతోషకరమమన్నారు. అనంతరం ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది అంటూ జీవితమంతా సమాజం కోసం అంకితం చేసిన మహా వ్యక్తి, శక్తి కాళోజీ అని అన్నారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. కవులు, రచయితలు, కళాకారులు వరంగల్‌ను గొప్ప సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రముఖ కవి బిల్ల మహేందర్ ఆహ్వానంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఆచార్య బన్న ఐలయ్య, అనిశెట్టి రజిత, ముహ్మద్ సిరాజుద్దీన్, సీతాల రాఘవేందర్, కవులు నెల్లుట్ల రమాదేవి, అంజనీదేవి, చింతల కమల, దేవులపల్లి వాణి, మాధారపు వాణిశ్రీ, అన్వర్, తాడిచర్ల రవి, కుమార్, పల్లేరు వీరస్వామి, కార్తీకరాజు, జితేందర్ పాల్గొన్నారు.

నిట్‌లో ఎస్సీ, ఎస్టీలకు 'గేట్' ఉచిత కోచింగ్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : వరంగల్ నిట్‌లో విద్యా మంత్రిత్వ శాఖ (ఎంవోఈ) నుంచి సబ్‌ప్లాన్ గ్రాంట్ల నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గేట్ ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. 2024-2025 సంవత్సరానికి అన్ని శాఖల్లో డిసెంబర్ 2 నుంచి జనవరి 27 వరకు ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్, అకాడమిక్ బ్లాక్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్ భూక్యా నాగు మాట్లాడుతూ.. డిసెంబర్ 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, అభ్యర్థులకు నోట్స్, మెటీరియల్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు www.nitw.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. వివరాలను తెలియజేసేందుకు 99631 69781, 83329 69287 నంబర్లతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశామన్నారు.

యుద్ధభేరి మహాసభ కరపత్రాల ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 20 : తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్(టీఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ సర్కిల్లో యుద్ధభేరి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 22న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యఅతిథిగా కూరెల్ల మహేశ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ దామల్ల సత్యం, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఈర్ల ప్రసాద్, సత్యం, కూరెళ్ల ఉదయ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాంయాదవ్, పులి శ్రీనివాస్, నాయకులు ఎదునూరి రాజమౌళి, బోనగాని యాదగిరిగౌడ్, ఇమ్మడి ప్రసన్న, జిల్లా అధ్యక్షుడు గోవిందరాజు పాల్గొంటారని చెప్పారు.

సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి

వాగ్దేవిలో ఓరియంటేషన్ ఇండక్షన్ ప్రోగ్రాం

నయీంనగర్, నవంబర్ 20 : హనుమకొండలోని వాగ్దేవి కళాశాలలో 2024-25 విద్యా సంవత్సర నూతన విద్యార్థులకు బీ ఫార్మసీ, ఫార్మాడీ ఓరియంటేషన్ ఇండక్షన్ ప్రోగ్రాం ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. విద్యార్థులు తమ కోర్సులను పూర్తి చేసిన తర్వాత కాలేజీలో నిర్వహించే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో పాటు వివిధ నియామకాల అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, హెచ్‌వోడీలు శ